

ఎథ్నిక్ డే కార్యక్రమంలో పాల్గొన్న ఫ్యాకల్టీ, విద్యార్థులు

ఎస్కీలో 'ఎథ్నిక్ డే'

రాయదుర్గం: భిన్నత్వంలో ఏకత్వం కోసమే 'ఎథ్నిక్ డే' అని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ (ఎస్కీ–ఎస్‌పీజీఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం ఎథ్నిక్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ పలు సంస్కృతులను ఒకచోట చేర్చి ఐక్యంగా ఉండేలా చేయడం కోసం ప్రతి యేటా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. మనదేశంలో అనాదిగా కొనసాగుతున్న సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్కీ ఎస్‌పీజీఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ జగన్‌మోహన్‌రెడ్డి, ఏ అండ్ పీ చీఫ్ లక్ష్మీకాంతరావు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ


ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న వేదపండితులు, భక్తులు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ హేమావతినగర్ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో శివాలయం ఎదురుగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవంను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అనంతరం హోమం, అన్నదానం చేశారు. ఆలయ కమిటీ ప్రెసిడెంట్ డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి, విజయలక్ష్మి, రవిగౌడ్, కేహెచ్‌ఎస్ శర్మ, శ్రీనివాస్, అనురాధ, రాధిక, జనార్ధనరావు, చింతపల్లి వంశీ, శోభారాణి, ఇందిరా, డాక్టర్ పద్మప్రియ, రాధాకృష్ణ, శ్రీధర్‌రెడ్డి, హరిశంకర శర్మ పాల్గొన్నారు.

11-16వరకు హెచ్‌సీయూలో బయోటెక్ సమ్మిట్

రాయదుర్గం: హెచ్‌సీయూలో ఈనెల 11వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఫార్మా అండ్ బయోటెక్ సమ్మిట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్(ఎఫ్ఏబీఏ), సైన్స్ గురుస్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ సంయుక్త ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహిస్తారు ఈ కార్యక్రమంలో ప్రారంభ ప్రత్యేక ఉపన్యాసాన్ని ఇన్‌వెని ఏఐ ప్రతినిధి డాక్టర్ కృష్ణన్ నందబాలన్, ఐస్పిరిట్ ప్రతినిధి డాక్టర్ సును ఇంజనీర్, బ్రేన్ ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధి డాక్టర్ వాసుదేవవర్మ, సైంజీన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ డాక్టర్ మహేష్ భల్గాట్ ప్రసంగిస్తారని ఎఫ్ఏబీఏ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పి రెడ్డన్న వివరించారు.

'అశ్వి' అదరహో..




హైదరాబాద్ యూత్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్‌లో సిల్వర్ మెడల్ సాధించిన అశ్వి కపూర్, స్విమ్మింగ్ ప్రాక్టీస్ చేస్తున్న దృశ్యం (ఫైల్)


మెడల్స్‌తో చిన్నారి అశ్వికపూర్

- అటు కూచిపూడి..ఇటు స్విమ్మింగ్
- చిన్న వయసులోనే అత్యంత ప్రతిభ

శేరిలింగంపల్లి: స్విమ్మింగ్, నృత్యం, చదువులో చిన్నారి అశ్వికపూర్ తన ప్రత్యేకతను చాటుతోంది. తొమ్మిదేళ్ల ప్రాయంలోనే స్విమ్మింగ్‌లో తనదైన శైలిలో పతకాలు సాధిస్తూనే కూచిపూడి నృత్యంలోనూ రాణిస్తోంది. తల్లిదండ్రులు అంకూర్ కపూర్, తృప్తి గోయల్ ఇరువురూ ఐటీ ఉద్యోగులే. అశ్వి ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నారు. దీంతో చిన్నారి పతకాలు సాధిస్తోంది. కాగా అశ్వి తెల్లాపూర్‌లోని మంథన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతోంది. నల్లగండ్లలోని అపర్ణ సైబర్ లైఫ్‌లో నివాసముంటున్నారు. అశ్వి కూచిపూడి నృత్యం, స్విమ్మింగ్‌తో బాటు కీ బోర్డు ప్లే చేస్తూ అందరినీ ఆకట్టుకుంటోంది. తండ్రి అంకూర్ కపూర్ బెంగుళూరులో స్విమ్మింగ్ ప్రాక్టీస్ చేయించారు. అనంతరం అపర్ణ సైబర్ లైఫ్‌లో కోచ్ టంకల విశ్వనాథం గుప్త ఆధ్వర్యంలో ప్రాక్టీస్ చేసింది. అదే విధంగా గచ్చిబౌలి స్టేడియంలో కూడా శిక్షణ పొందింది. కూచిపూడి నృత్యాన్ని భారతీయ విద్యాభవన్, జగన్నాథ్ దేవాలయంలో ప్రదర్శించి అందరి మన్ననలు పొందింది.

- అశ్వి స్పెల్‌బీ పోటీలలో కూడా మొదటి స్థానంలో నిలిచింది.
- జాతీయ స్థాయి టాలెంట్ సర్చ్ పోటీలలో 2022లో ప్రతిభను చాటింది.
- స్కూల్‌లో స్టోరీ బుక్స్ చదివే పోటీలలో రాణిస్తూ సర్టిఫికెట్లు కూడా సాధించింది.

సాధించిన మెడల్స్ ..

- ఈ ఏడాది రెండు మెడల్స్ సాధించింది.
- 2023లో హైదరాబాద్ యూత్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్‌లో బటర్ ఫ్లై విభాగంలో సిల్వర్ మెడల్
- 2023 హైదరాబాద్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో అండర్–9 విభాగంలోని బ్రీస్ట్ స్ట్రోక్‌లో బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకుంది.


కూచిపూడి డ్యాన్స్ పోటీల్లో బహుమతి అందుకుంటున్న అశ్వి కపూర్ (ఫైల్)

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నదే లక్ష్యం

రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలన్నదే లక్ష్యం. మా తల్లిదండ్రులు మంచి శిక్షణ ఇప్పిస్తున్నారు. చదువుకు అడ్డంకులు రాకుండా శ్రద్ధతో ముందుకుసాగుతున్నా.

–అశ్వికపూర్, 4వ తరగతి, మంథన్ ఇంటర్నేషనల్ స్కూల్

నేడు మానవ హక్కులపై అవగాహన

రాయదుర్గం: వరల్డ్ హ్యూమన్ రైట్స్ డేను పురస్కరించుకొని శనివారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కన్వీనర్ టి రామస్వామి యాదవ్ తెలిపారు. కొత్తగూడ సఫారినగర్‌లోని న్యూబ్లూమ్ హైస్కూల్‌లో ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉర్దూ విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ అఫ్రోజ్ ఆలమ్ ముఖ్య అతిథిగా విచ్చేసి అవగాహన కల్పిస్తారని వివరించారు.

11న కార్తీక దీపోత్సవం

రాయదుర్గం: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని రాయదుర్గంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం కార్తీక దీపోత్సవంను నిర్వహిస్తామని నాగార్జున ఉన్నత పాఠశాల అధినేత ఏ భరత్‌కుమార్ తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి పాఠశాల చైర్మన్ ఏ కృష్ణ ఆధ్వర్యంలో త్రిదండి శఠగోప రామానుజ జీయర్ స్వామి, ఋగ్వేదం సలక్షణ ఘనాపాఠి సందుగుల రాఘవాచార్యుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం సాగుతుందన్నారు. ఈ సందర్భంగా సహస్ర నామ పుష్పార్చన, భక్తులచే మహా రుద్రాభిషేకం, హనుమాన్ ఆలయం నుంచి స్వామి ఊరేగింపును నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5 గంటలకు వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఉంటుందని వివరించారు. ఏక హారతి, నక్షత్ర హారతి, మహా హారతి, కుంభ హారతి వంటి ప్రత్యేక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తామన్నారు.

తల్లిదండ్రులు దైవంతో సమానం

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ


గ్రేస్ ఓల్డ్ ఏజ్ హోమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని మిత్రహిల్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రేస్ ఓల్డ్ ఏజ్ హోమ్‌ను శుక్రవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు దైవంతో సమానమని వారిని వృద్ధాప్యంలో బాగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివేకానందనగర్ డివిజన్ బీఆర్‌యస్ పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు కోనేరు ప్రసాద్, ప్రసాద్, యుతేష్, వృద్ధాశ్రమం చైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలి

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందేందుకు వచ్చిన కేసీఆర్‌ను పార్టీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరామర్శించారు. త్వరగా ఆయన కోలుకోవాలని అభిప్రాయపడ్డారు.

ఎమ్మెల్యే గాంధీకి సన్మానం



ఎమ్మెల్యే గాంధీని సన్మానించిన కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్


ఎమ్మెల్యే గాంధీని సత్కరించిన సిద్దిఖీనగర్‌వాసులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించిన ఆరికెపూడి గాంధీని ఘనంగా సన్మానించారు. శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఎం.రాజు యాదవ్, బీఆర్ఎస్ నాయకులు తెల్లాపురం శ్రీనివాస్‌రాజ్ ముదిరాజ్, గడ్డం రవియాదవ్, లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గుల్‌మొహర్‌పార్కు కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ అధ్యక్షులు షేక్ ఖాసీం గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు.

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీని సిద్దిఖ్ నగర్‌వాసులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతికాలనీ, బస్తీలో మౌలిక వసతులు కల్పించడంపై ప్రత్యేక దృష్టిపెడతామన్నారు.


బచ్‌పన్ ప్లే స్కూలులో సర్టిఫికెట్లతో చిన్నారులు

ఇంటర్ స్కూల్ కాంపిటేషన్

భాగ్యనగర్‌కాలనీ: భాగ్యనగర్‌కాలనీలోని బచ్‌పన్ ప్లే స్కూలులో శుక్రవారం ఇంటర్ స్కూల్ కాంపిటేషన్‌ను నిర్వహించారు. ఈ కాంపిటేషన్లో విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను కనబర్చారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ చిన్న వయస్సులోనే విద్యార్థుల్లో దాగి వున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్‌లు అందజేశామన్నారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం


పూజలో పాల్గొన్న కాంగ్రెస్ నేత విజయారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని నందినగర్‌లో కొలువుదీరిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీ ఆంజనేయస్వామి నిజాభిషేకం, నిత్య హోమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం కనుల పండువగా జరిగింది. ఖైరతాబాద్ కాంగ్రెస్ నాయకురాలు పి. విజయారెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కిరణ్‌కుమారచార్యులు, శేషశైలాచార్యులు, నిర్వాహకులు దశరథ్ తదితరులు పాల్గొన్నారు.


కలశాభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులు

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 25, పచ్చిమిర్చి 50 , బెండ 50, కాకర 40, దొండ 50, దోస 35, ఆలు 25, చామ 50, కీర 25, బీర 60, వంకాయ 40, గోకర 50, బీన్స్ 50, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 50, చిక్కుడు 50, ఉల్లి 60 (1 కేజీ), ములక్కాయలు (3) 20 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 250, వెల్లుల్లి 300.

దివ్యాంగుల ఆత్మగౌరవ ర్యాలీ

పటాన్‌చెరు టౌన్: దివ్యాంగులను గౌరవిద్దాం ... వారి అభివృద్ధికి తోడ్పడదామని ఇస్నాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి దివ్యాంగులు ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ఇస్నాపూర్‌లో దివ్యాంగుల సంఘం అధ్యక్షులు మహేష్, కార్యదర్శి జ్యోతితో కలిసి తెలంగాణ మస్కులర్ డిస్ట్రఫీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా ఇస్నాపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులతో ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుందర్ రావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

40 రోజులు.. కాలనీలలో క్రీడా పోటీలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మరియు నల్లగండ్లలోని గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులతో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వరగారి రమణ తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాలనీవాసుల మధ్య మరింత ఐక్యత, స్నేహాన్ని పెంచాలనే లక్ష్యంతో అసోసియేషన్ ఆధ్వర్యంలో 40 రోజులపాటు వివిధ కాలనీలలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇందులో ఎనిమిది రకాల క్రీడా పోటీలు ఉంటాయని ,సుమారు 700 మంది క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొంటారని తెలిపారు.ఈ పోటీలు శనివారం నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీ వాసులు ఈ పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేసిన దొడ్ల వెంకటేష్ గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ మరియమ్మనగర్‌లో నివాసముంటున్న హేమ లక్ష్మణ్ రావు, అంబికల కుమార్తె శృతి వివాహానికి డివిజి ట్రస్ట్ ద్వారా 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, పద్మయ్య, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ ప్రపంచంలో కృత్రిమ మేధస్సుకు ప్రాధాన్యత

ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల


సమ్మిట్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న డీన్ మదన్ పిల్లుట్ల

రాయదుర్గం: డిజిటల్ ప్రపంచంలో కృత్రిమ మేధస్సుకు ఎంతో ప్రాధాన్యత ఉందని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఐఎస్‌బీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డేటా సైన్స్ (ఐడీఎస్) జనరేటివ్ ఏఐ, రిటైల్ అనలిటిక్స్, లాంగ్వేజ్ లెర్నింగ్ మోడల్స్, సైబర్ సెక్యూరిటీ, అప్‌స్కిల్లింగ్‌పై డేటాసైన్స్ సమ్మిట్–2023 ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించిన అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న రంగాలలో తదుపరి పరిశోధన యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. ఐడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ మనీష్ గంగ్వార్ మాట్లాడుతూ పర్యావరణ వ్యవస్థలో జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ నమూనాల యొక్క కొన్ని కీలక సవాళ్ళు కూడా ఉన్నాయన్నారు. నియంత్రణ, విద్య, గుర్తింపు ఫ్రేమ్ వర్క్‌ను ఆయన ప్రతిపాదించారు. ఏఐ, తప్పుడు సమాచారం, డీప్ ఫేక్‌లను అరికట్టాలన్నారు. కేపీఎంజీ హెడ్, ఇండియా లైట్ హౌజ్ యొక్క చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ సచిన్ అరోరా మాట్లాడుతూ మార్కెటింగ్ పరస్పర చర్యగా మారే యుగానికి నాంది పలికిందన్నారు. అనంతరం జనరేటివ్ ఏఐ, రిటైల్ అనలిటిక్స్, లాంగ్వేజ్ లెర్నింగ్ మోడల్స్, సైబర్ సెక్యూరిటీ, అప్‌స్కిల్లింగ్ వంటి అంశాలపై పరిశ్రమ నిపుణులు, విద్యావేత్తలు, పరిశోధకులు చర్చించారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

- డీఈఓ వెంకటేశ్వర్లు

జిన్నారం(పటాన్‌చెరు): విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని డీఈఓ వెంకటేశ్వర్లు టీచర్లకు సూచించారు. జిన్నారం మండలంలోని మాదారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం డీఈఓ సందర్శించారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠ్య ప్రణాళికను డీఈఓ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంగారంలో కంటి ఆస్పత్రి ప్రారంభం

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని గంగారంలో వాసన్ ఐ కేర్ ఆసుపత్రిని ఎమ్మెల్యే ఆరికపూడి గాంధీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకొని తక్కువ ధరకు మంచి వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ ప్రారంభోత్సవంలో ఆసుపత్రి ప్రతినిధులు, డాక్టర్లు, సిబ్బంది, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జనవరి 6, 7 తేదీల్లో సలామ్ సౌక్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టర్కీ కౌన్సిల్ జనరల్ ఒర్హాన్ యాల్మాన్ ఒకాన్

బంజారాహిల్స్: హైటెక్ సిటీ ఎన్ కన్వెన్షన్‌లో జనవరి 6, 7 తేదీల్లో ప్రఖ్యాత గాయకుడు లక్కీ అలీ లైవ్‌తో సలామ్ సౌక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 10లో టర్కీ కౌన్సిల్ జనరల్ ఒర్హాన్ యాల్మాన్ ఒకాన్ పలువురు మోడల్స్‌తో కలిసి ఆవిష్కరించారు. కలినరీ షాపింగ్‌తో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు సలామ్ సౌక్‌లో కనువిందు చేయనున్నట్లు తెలిపారు. 130 రిటైల్ స్టాల్స్, 25 ఫుడ్‌కోర్ట్‌లు నగరవాసులను ఆకట్టుకోనున్నాయన్నారు. తెలంగాణ టూరిజం ఈ కార్యక్రమాన్ని స్పాన్సర్ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదం.. వ్యక్తికి తీవ్ర గాయాలు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): కారు ఓ బైకును ఢీకొన్న ఘటనలో వ్యక్తి తీవ్ర గాయాలపాలైన సంఘటన రామచంద్రాపురం పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది.పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీకి చెందిన చెన్నయ్య కార్ డ్రైవర్. గురువారం రాత్రి అదే కాలనీలో నివాసముండే ఆయన బావ నరేంద్ర నివాసంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. చెన్నయ్యతో పాటు మియాపూర్‌లో నివాసం ఉండే అతని మిత్రుడు రవి పాల్గొన్నాడు. కాగా శుక్రవారం తెల్లవారుజామున చెన్నయ్య అతని మిత్రుడు రవిని మియాపూర్‌లో దింపి వచ్చేందుకు మోటార్ బైక్‌పై బయలుదేరారు. అశోక్‌నగర్ సమీపంలో వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను కారు వెనుక నుంచి వచ్చి ఢీకొట్టడంతో చిన్నయ్య తీవ్రంగా గాయపడ్డాడు.వెంటనే అతనిని ప్రైవేట్ ఆసుపత్రి తరలించారు. పరిస్థితి విషమంగా ఉంది. రవి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



పటాన్‌చెరు టౌన్: ఏకాదశిని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు.అనంతరం స్వామివారికి నైవేద్యం పెట్టి, మొక్కులు చెల్లించుకున్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



పటాన్‌చెరు టౌన్: మానవ హక్కులపై అవగాహన అవసరమని, ఎదుగుదలకు హక్కులు కీలకపాత్ర పోషిస్తాయని విశ్వభారతి లా కళాశాల ప్రిన్సిపల్ భవాని అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామ పరిధిలోని విశ్వభారతి లా కళాశాలలో మానవ హక్కుల దినోత్సవంను నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు హక్కులపై తమ సందేశం ఇచ్చారు.అనంతరం ప్రిన్సిపల్ భవాని మాట్లాడుతూ... ప్రతి ఏడాది డిసెంబర్ 10 న మానవహక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో లా కళాశాల అధ్యాపకులు అంబర్, గురుమూర్తి, వర్ష ,రమ్య, కీర్తి, అన్వి, విద్యార్థులు పాల్గొన్నారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది. 'యాంగర్ ఫ్రీ లైఫ్ స్టైల్' అనే అంశంపై సీనియర్ రాజయోగ టీచర్ బి.కె.కవిత ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాల కోసం 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

రోడ్డు మధ్యలో వ్యర్థాలు


కృషినగర్ కాలనీలో రోడ్డు మధ్యలో కుప్పలుగా చెత్త

మియాపూర్ : మియాపూర్‌లోని కృషినగర్ కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పూడికతీత వ్యర్థాలను రోడ్డుపై వదిలేశారు. రోడ్డు పొడవునా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. దుర్వాసన వెలువడుతుండడంతో స్థానికులు ఇబ్బందులుపడుతున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది వ్యర్థాలను నిర్లక్ష్యంగా వదిలేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నగరంలో గ్లామ్ పరిక్రమ ఎగ్జిబిషన్ ప్రారంభం

మాదాపూర్: మహిళల మనసు దోచే అన్ని రకాల ఫ్యాషన్ స్టైల్స్ ఒకే ఎగ్జిబిషన్‌లో ఉండడం సంతోషకరమైన విషయమని మేయర్ విజయలక్ష్మి అన్నారు. హైటెక్స్‌లో గ్లామ్ పరిక్రమ లగ్జరీ ఎగ్జిబిషన్‌ను ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో 150కి పైగా బ్రాండ్‌లకు చెందిన వివిధ రకాల ఉత్పత్తులను ప్రదర్శించడం గొప్ప విషయమన్నారు.